క్లుప్తంగా

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


ఎంపికైన పల్లవి

వేంపల్లె : జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కంతూరి పల్లవి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం నారాయణమ్మ, పీడీ విజయభారతిలు తెలిపారు. ఆ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పల్లవి విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. 16వ తేదీ నుంచి 21వ తేదీవరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థిని ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

లింగ వివక్ష సహించరానిది

వేంపల్లె : ఆధునిక సమాజంలో లింగ వివక్షత సహించరానిదని హిస్టరీ అధ్యాపకుడు బాలకొండ గంగాధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన లింగ వివక్షత అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. లింగ వివక్షతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతనెల 25 నుంచి ఈనెల 22వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు. బాల్య వివాహాలు, స్త్రీ, శిశు హత్యలు, వరకట్నం లాంటి సాంఘిక దురాచారాలను అరికట్టాల్సిన బాధ్యత ఆధునిక సమాజం మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలి


హిందు సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు

సింహాద్రిపురం : ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకోవాలని సమరత సేవా సంస్థ ప్రతినిధి ఈశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం గురిజాల గ్రామంలో గురుకుంట ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో హిందు సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన ధర్మం యొక్క గొప్పతనం గురించి, మన ధర్మం వదిలితే వచ్చే నష్టాల గురించి, మతం మారితే మన దేశానికి, ధర్మానికి కలిగే నష్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవీంద్రనాథరెడ్డి, అప్పస్వామి ఆలయ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, గురుకుంట ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాల శత వసంతోత్సవం

సింహాద్రిపురం : మండలంలోని బి.చెర్లోపల్లె మండల ప్రాథమిక పాఠశాల వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు శత వసంతోత్సవ కార్యక్రమాన్ని శనివారం పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు సరస్వతి విగ్రహ ప్రాణ ప్రతిష్ట, ఉదయం 8 గంటల నుంచి విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, 9 గంటలకు పూర్వ విద్యార్థుల సమ్మేళనం, పూర్వ ఉపాధ్యాయులను సన్మానించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భోజన కార్యక్రమం ఉంటుందన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణలో పారదర్శకత

కడప స్పోర్ట్స్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని కడప నగరపాలక టీపీఆర్‌ఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కడప నగరంలోని నగరపాలకసంస్థ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్‌కు సంబంధించి వార్డు వలంటీర్లకు అంపైరింగ్, టోర్నమెంట్ నిర్వహణ, మొబైల్ లైవ్‌స్కోరింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఎస్‌డీఓ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ మాట్లాడుతూ ఐదుక్రీడాంశాల్లో నిర్వహించే ఈ మెగా టోర్నమెంట్ తొలుత సచివాలయస్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వలంటీర్లు అంపైరింగ్, నిర్వహణలో ఎలా మెలగాలో వివరించారు. మాస్టర్ ట్రైనర్లు ఎం. ప్రవీణ్ కిరణ్, ఎజాస్‌అహ్మద్‌లు మాట్లాడుతూ మ్యాచ్‌ల నిర్వహణ, లైవ్‌స్కోరును ఏ విధంగా మొబైల్‌లో అప్‌లోడ్ చేయాలి అన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్‌లు వలంటీర్లు పాల్గొన్నారు.

17 నుంచి ధనుర్మాస పూజలు

కడప కల్చరల్ : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 17 నుంచి తమ ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నామని అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి ధనుర్మాస పూజలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నెలరోజులపాటు శ్రీ గోదా సమేత లక్ష్మి నారాయణస్వామి సన్నిధిలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేశాను

● ఆర్‌ఓబీకి భూమి పూజలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


ఆర్‌ఓబీకి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పట్టణ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేశానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణ ప్రజల దశాబ్దాల కోరిక రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)కి స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి భూమి పూజ చేసి మాట్లాడారు. తాను గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలనీ నెరవేర్చానన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజల దశాబ్దాల కోరిక మరో ఏడాది కాలంలో నెరవేరబోతుందని సంతోషం వ్యక్తం చేశారు. రూ.39 కోట్లు ఆర్‌ఓబీ నిర్మాణానికి, మరో రూ.32 కోట్లు భూ బాధితులకు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మొత్తం రూ.72 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్ట్ పూర్తి అవుతుందన్నారు. కేంద్ర రోడ్ల శాఖా మంత్రి నితిన్ గడ్కరి రాష్ట్ర పర్యటనకు వచ్చిన సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 30 ఆర్‌ఓబీలు మంజూరు చేయాలని కోరారన్నారు. గడ్కరి ఫస్ట్ ఫేజ్‌లో 8, సెకండ్ ఫేజ్‌లో 12 ఆర్‌ఓబీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, అయితే ఫస్ట్ ఫేజ్‌లో మంజూరై భూమి పూజ చేసుకుంటున్న ఫస్ట్ ఆర్‌ఓబీ మనదేనన్నారు. ఆర్‌ఓబీ భూ బాధితులకు త్వరలోనే ఫైనాన్స్ క్లియర్ అవుతుందన్నారు. ఏడాదిన్నర కాలంలో ఆర్‌ఓబీ నిర్మించాలనే నిబంధనలు ఉన్నప్పటికి ఏడాదిలోపే ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు చెప్పడం హర్షణీయం అన్నారు. అయితే నిర్మాణంలో నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. వందల సంవత్సరాలు ఈ బ్రిడ్జి మనుగడలో ఉండేలా మంచి నాణ్యతతో పాటు బ్రిడ్జికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు, డ్రైనేజ్ తప్పనిసరిగా నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఇప్పటికే కమలాపురం పట్టణంలో వందల కోట్ల అభివృద్ధి పనులు చేశామని, కొన్ని పూర్తి అయ్యాయని, మరికొన్ని త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. అలాగే త్వరలో పాగేరు వంక పై వంతెన, బైపాస్ రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ చేస్తామన్నారు. కమలాపురంకు ఇన్ని నిధులు మంజూరు చేసిన సీఎం జగనన్నను కమలాపురం ప్రజలు మరో సారి ఆశీర్వదించాలని ఎమెమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పరిశ్రమల, ఉద్యాన శాఖ రాష్ట్ర సలహాదారులు రాజోలి వీరారెడ్డి, సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఇతర నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, హిదాయత్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


రైతులకు సబ్సిడీ పైపులను అందిస్తున్న జెడ్పీటీసీ, ఏపీఐఐసీ డైరెక్టర్, తదితరులు

వేంపల్లె : రైతుకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలుస్తోందని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనం వద్ద ఏపీఐఐసీ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత వేణుగోపాల్, వ్యవసాయ అధికారులతో కలిసి అయన రైతులకు సబ్సిడీపై పీవీసీ పైపులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలనే సదుద్దేశ్యంతో అవసరమైన నాణ్యమైన బ్రాండెడ్ పీవీసీ పైపులను 50 శాతం సబ్సిడీతో ఇచ్చిందన్నారు. మండల వ్యాప్తంగా 400 మంది రైతులకు సబ్సిడీపై పైపులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రైతుకు మేలు చేయాలన్న ఆలోచనతో జిల్లా కలెక్టర్ విజయరామరాజు, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలతో మాట్లాడి సగం ధరకే నాణ్యమైన పీవీసీ పైపులు అందేలా చొరవ చూపారని, పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన రైతులకు ఈ అవకాశం దక్కడం గుర్తించుకోదగ్గ విషయమన్నారు. అంతేకాక గత టీడీపీ ప్రభుత హయాంలో మార్కెట్ దరకు, ప్రభుత్వం ఇచ్చే ధరకు పెద్ద తేడా ఏమి ఉండేది కాదన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్, ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

వేంపల్లె : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన కిమ్స్ ఆసుపత్రి పర్యవేక్షణలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మానవత సంస్థ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా జీఆర్బీస్, బీపీ, ఇసీజీ, 2డీఏకో పరీక్షలతోపాటు అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అలాగే 9642757744 అనేఫోన్ నెంబర్ ద్వారా ఎన్‌రోల్‌మెంట్ నమోదు చేసుకోవాలని సూచించారు.

భవిత సెంటర్‌కు దివ్యాంగులను పంపండి


మాట్లాడుతున్న ఎంఈఓ గంగిరెడ్డి

చెన్నూరు : భవిత సెంటర్‌కు దివ్యాంగుల పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మండల విద్యాశాఖ అధికారులు గంగిరెడ్డి, సునీతలు తెలిపారు. శుక్రవారం చెన్నూరు భవిత సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. భవిత సెంటర్‌లో పిల్లలకు విద్య, వైద్యసేవలతోపాటు అనేక మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. పిల్లలకు ఫిజియోథెరపీ వైద్య సేవలపై డాక్టర్ ఎలిజిబెత్ రాణి వివరించారు. పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : 33/11కె.వి. నల్లపురెడ్డిపల్లె, 33/11కె.వి ఇ.కొత్తపల్లె, 33/11కె.వి కదిరి రోడ్డు, 33/11కె.వి. సరస్వతి మెన్స్ విద్యుత్ ఫీడర్లలో మెయింటెన్స్ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేముల : 33 కె.వి. వేముల ఫీడర్, 33కె.వి. పెర్నపాడు ఫీడర్లల్లో మరమ్మతుల కారణంగా 33/11కె.వి. వేల్పుల, రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, పెద్ద జూటూరు, వేముల, పెర్నపాడు, గొల్లలగూడూరు, నల్లచెరువుపల్లె, వి.కొత్తపల్లె, భూమయ్యగారిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ జేఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చక్రాయపేట : మండలంలోని చక్రాయపేట, మహదేవపల్లె, కె.రాజుపల్లె, కె.ఎర్రగుడి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 8:15 నుంచి మధ్యాహ్నం 12:15 వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

కమలాపురం : పట్టణంలోని రైల్వేగేటు నుంచి దర్గా, చౌక్ సెంటర్, గిడ్డంగి వీధి తదితర కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ చాంద్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారంను పురస్కరించుకుని విద్యుత్ లైన్ల మార్పు తదితర మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

జగనన్న ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్దపీట


జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చేరెడ్డి సావిత్రి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : జగనన్న ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్ద పీట వేసిందని మైలవరం మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి తెలిపారు. శుక్రవారం మండలంలోని తొర్రివేముల గ్రామంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గడప గడపకు వెళ్లి వలంటీర్లు పథకాలు ప్రజలకు అందించడం దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని తిరిగి సీఎంగా చేసుకోవాలన్నారు. అనంతరం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ రామంజనేయులు, ప్రసాద్‌రెడ్డి, నిరంజన్, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గుర్విరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చేరెడ్డి చెన్నకేశవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన

కడప రూరల్: ఇంటి లోపల, పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నిర్మూలించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ప్రకాష్‌నగర్‌లో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ను డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి లోపల తొట్లు, బానలు, కుండలు పాత సామాన్లు ఉంటే పరిశుభ్రంగా నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. అలాగే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన దోమల నిర్మూలనకు స్థానికులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హైమావతి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

శబరిమలైకు అయ్యప్ప స్వాముల పాదయాత్ర


శబరిమలైకి వెళుతున్న అయ్యప్పస్వాములు

పులివెందుల రూరల్ : పట్టణంలోని చిన్నరంగాపురం గ్రామ సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం నుంచి పులివెందుల, లింగాల మండలం అంబకపల్లె గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు చంద్ర బాబురెడ్డి, బండి శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం 7వ సారి శబరిమలైకి పాదయాత్రగా బయలుదేరారు. అయ్యప్పస్వామి ఆలయం నుంచి పార్నపల్లె బస్టాండు, పాత బస్టాండు, కొత్త బస్టాండు మీదుగా కదిరి రోడ్డు నుంచి నామాలగుండు వరకు ఈ పాదయాత్ర సాగుతుంది. భక్తులు వందలాది మంది పాల్గొని వారు చేపట్టే శబరిమల పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.

దర్గా నిర్మాణానికి రూ.50 వేలు వితరణ


రూ.50 వేలు అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండలంలోని కర్ప్రకుంటపల్లె గ్రామంలో దర్గా నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో కర్ప్రకుంట గ్రామ పెద్దలకు రూ.50 వేలు వితరణగా అందించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర


తిరుమలకు పాదయాత్ర చేపడుతున్న నల్లపురెడ్డిపల్లె గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పులివెందుల రూరల్ : 2024 ఎన్నికలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొంది మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సీఎం కావాలని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన గ్రామస్తులు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు శుక్రవారం గ్రామం నుంచి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్న ఉద్దేశ్యంతో తిరుమల దేవస్థానానికి పాదయాత్ర చేపడుతున్నామన్నారు. 5 రోజులపాటు పాదయాత్ర చేపట్టి 6వ రోజు శ్రీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

దివ్యాంగులకు గృహోపకరణాలు వితరణ


దివ్యాంగురాలికి ప్రెషర్ కుక్కర్‌ను అందిస్తున్న కృష్ణమూర్తి, తదితరులు

పులివెందుల టౌన్ : దివ్యాంగుల సేవకు పత్ర సంఘం ఎల్లప్పుడు ముందుంటుందని పత్ర కుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక వికలాంగుల కార్యాలయంలో వికలాంగుల నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమకున్న దాంట్లో కొంత ఇతరులకు సాయం చేసే గుణం ఎప్పుడు కలిగి ఉండాలన్నారు. అంతకముందు దివ్యాంగుల స్ఫూర్తి ప్రదాతలు లూయిస్ బ్రెయిల్, హెలెన్ కెల్లర్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం వికలాంగుల దినోత్సవ కేక్‌ను కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత, పత్ర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సారే విజయ్ కుమార్ సమకూర్చిన 25 ప్రెషర్ కుక్కర్లను దివ్యాంగుల కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పత్ర కుల సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షుడు గంగులయ్య, కదిరి మాజీ జెడ్పీటీసీ ఉత్తన్న, పత్ర కుల సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హేమవర్ధన్, ప్రచార కార్యదర్శి మేకల ఉత్తన్న, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాలకు మద్దతు ధర కల్పించాలని నిరసన


ఆర్డీఓ కార్యాలయం ఎదుట పాలు కిందపోసి నిరసన తెలుపుతున్న రైతులు

జమ్మలమడుగు : మండల పరిధిలోని మహిళా పాల రైతులకు డైరీల యాజమాన్యాలు సరైన గిట్టుబాటు ధర కల్పించాలంటూ శుక్రవారం మహిళా రైతులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సున్నపురాళ్లపల్లె, కన్నెలూరు, జమ్మలమడుగు, ఇతర ప్రాంతాలకు చెందిన పాల రైతులు ర్యాలీగా పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేసి అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పాల రైతులు మాట్లాడుతూ హెరిటేజ్, దొడ్ల, సంఘం, తిరుమల, జెర్సీ పాలడైరీలన్నీ కుమ్మక్కై చిన్న పాలడైరీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు.

పాల రైతుల నుంచి పాలు సేకరించే డైరీలు కేవలం లీటర్ రూ.30కి మాత్రమే తీసుకుంటామంటున్నారన్నారు. రైతుల నుంచి తక్కువ ధరలకు సేకరించిన వారు మాత్రం రేట్లు తగ్గించకుండా అమ్ముతున్నారన్నారు. ప్రస్తుతం డైరీలు రైతుల వద్ద నుంచి పాలను సేకరించకపోవడంతో పాలు మిగిలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. పశువులకు మేతలేక కొనుగోలు చేసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డైరీలపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాముల బ్రహ్మానందరెడ్డి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ముద్దనూరు రోడ్డులోని పెన్నానది ఒడ్డున వెలసిన అయ్యప్పస్వామి ఆలయం నుంచి పట్టణంలోని పాతబస్టాండ్, మార్కెట్‌బజార్, మెయిన్‌బజార్, తేరు రోడ్డు, సంజామలమోటు మీదుగా మహిళ భక్తులు దీపాలు పట్టుకుని గ్రామోత్సవాన్ని గూరుజీ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం అంబలం పూజ నిర్వహించి, ఆదివారం ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కల్యాణ వైభోగం


కల్యాణ మూర్తులుగా స్వామి, అమ్మవార్లు


గోవింద నామస్మరణ చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, అనంతరం తోమాల సేవ, అర్చనలు నిర్వహించారు. 9 గంటల నుంచి కల్యాణోత్సవం ప్రారంభమైంది.

ముగ్ధమనోహరం..

కల్యాణ ఘట్టంలో భాగంగా కుడివైపున నూతన వరుడిగా శ్రీవారిని, ఎడమవైపు ఉభయదేవేరులైన శ్రీదేవి, భూదేవి మాతలను వధువులుగా అలంకరించి కొలువుదీర్చారు. వేద పండితులు కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. పుణ్యాహవాచనం, కలశ ప్రతిష్ఠ, గణపతిపూజ, ప్రవరలు, యజ్ఞోపవీత ధారణల అనంతరం సంప్రదాయంగా కన్యాదానం చేశారు. మహామంగళ సూత్రాలను భక్తులందరికీ దర్శింపజేశారు. అనంతరం మంగళ వాయిద్యాల సుస్వరాలు, వేదమంత్రోచ్చాటనల మధ్య కల్యాణ వేడుక నిర్వహించారు. భక్తులందరికీ మంగళాక్షతలను కల్యాణ ప్రసాదంగా అందజేశారు. హాజరైన వారందరికీ వివాహ భోజనం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో కడప నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో సందడిగా గ్రామోత్సవం నిర్వహించారు.


కల్యాణోత్సవంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు

ప్రముఖుల హాజరు..

కల్యాణోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్యలు హాజరయ్యారు. నిర్వాహకులు వారిచే పూజలు నిర్వహింపజేశారు.

శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానము - పాలతల
గంగనపల్లె (గ్రా), పెండ్లిమర్రి (మం), వైఎస్ఆర్ జిల్లా.

వేలము ప్రకటన

సదరు దేవాలయమునకు సంబంధించి ఈ క్రింది తెలిపిన హక్కులను 18.12.2023 వ తేది ఉదయం 10.00 గం॥లకు సదరు దేవాలయము నందు బహిరంగ వేలము నిర్వహించబడును

వ. నెం.	హక్కుల వివరము	దరావత్తు మొత్తం
1.	తలనీలాలు ప్రోగుచేసు కొను హక్కు ఒక సంవత్సరము కాలం పాటు 01-02-2024 నుండి 31-01-2025 వరకు	రూ.10,00,000
2	టెంకాయలు విక్రయించు కొను హక్కు విడిదినములలో ఒక సంవత్సరము కాలం పాటు 01-02-2024 నుండి 05-03-2024 వరకు మరియు 10-03-2024 నుండి 31-01-2025 వరకు	రూ.1,00,000
3	మహాశివరాత్రి పర్వదిన సందర్భమున 06-03-2024 నుండి 09-03-2024 వరకు టెంకాయల విక్రయించు హక్కు	రూ.1,00,000
4	మహాశివరాత్రి పర్వదిన సందర్భమున 06-03-2024 నుండి 09-03-2024 వరకు టోల్ గేటు వసూలు చేసుకొను హక్కు	రూ.1,00,000
5	టోల్ గేటు వసూలు చేసుకొను హక్కు 01-02-2024 నుండి 05-03-2024 వరకు మరియు 10-03-2024 నుండి 31-01-2025 వరకు అనగా సంవత్సరము కాలం పాటు	రూ.1,00,000
6	కొబ్బరి గిన్నెలు సేకరించు కొను హక్కు ఒక సంవత్సరము కాలం పాటు 01-02-2024 నుండి 31-01-2025 వరకు	రూ.1,00,000
7.	శ్రీ స్వామి వారికి మరియు అష్టదేవతలకు భక్తాదులు సమర్పించిన వస్త్రములు సేకరించు కొను హక్కు 01-02-2024 నుండి 31-01-2025 వరకు ఒక సంవత్సరము కాలం పాటు	రూ.10,000
8.	శ్రీ స్వామి & అష్టదేవతల గుడి యందు భక్తాదులు సమర్పించు బియ్యం బేడలు వగైరాలు సేకరించు కొను హక్కు 01-02-2024 నుండి 31-01-2025 వరకు ఒక సంవత్సరము కాలం పాటు	రూ.10,000
9.	పశువులు పేడ సేకరించు కొను హక్కు 01-02-2024 నుండి 31-01-2025 వరకు ఒక సంవత్సరము కాలం పాటు	రూ.10,000
10	దేవుని పటాలు, యంత్రాలు, దారాలు విక్రయించు కొను హక్కు 01-02-2024 నుండి 31-01-2025 వరకు ఒక సంవత్సరము కాలం పాటు	రూ.10,000

పాట పూర్తి అయిన వెంటనే హెచ్చుపాట మొత్తము చెల్లించవలెను. ఇతర షరతులు కార్యాలయము నందు తెలుపబడును.

శ్రీ అంబటి నాగమల్లారెడ్డి
ఆలయ చైర్మన్ & కమిటీ సభ్యులు
సెల్: 9701752819

కె.శ్రీనివాసులు గ్రేడ్-1
కార్యనిర్వహణాధికారి
సెల్: 9989793906